## క్లుప్తంగా

### ఉన్నత విద్యావంతులను చేయాలి



పల్లె పయనం పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న మాజీ మంత్రి నాని, మేయర్ తదితరులు

ఏలూరు (టూటౌన్): తల్లిదండ్రులు తమ బిడ్డలను ఉన్నత విద్యావంతులను చేయాలని, అదే వారికిచ్చే ఆస్తి అని మాజీ మంత్రి ఆళ్ల నాని పేర్కొన్నారు. చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొలిమేర హరికృష్ణ రూపొందించిన పల్లె పయనం పోస్టర్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో నాని బుధవారం విడుదల చేసి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచి చిన్నారులను ఇంగ్లీష్ మీడియం వైపు నడిపించాలన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల పేద చిన్నారులంతా ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని అందుకుని విద్యవైపు పరుగులు తీయాలని సూచించారు. పల్లె పయనం పేరుతో హరికృష్ణ పేదలు, చర్మకారులు నివశించే ప్రాంతాల్లో విద్య ఆవశ్యకతను వివరించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని నాని అభినందించారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఏఎంసీ చైర్మన్ నెర్సు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, ఏపీ మెడికల్ బోర్డు డైరెక్టర్ దిరిశాల వరప్రసాద్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్ గురునాథ్, పార్టీ సీనియర్ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు తదితరులు పాల్గొన్నారు.

### వీరాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

పెదపాడు: స్థానిక గండిచెరువుగట్టులోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం చేశారు. బుధవారం ఉదయం హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంలో నిర్వహించిన అన్నదానంలో భారీ సంఖ్యలో భక్తు లు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, రెడ్డి సతీష్‌కుమార్, అర్చకులు పరాంకుశం చక్రధర శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు. ఏపూరులోని సీతారామ దాసాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని అన్నదానం నిర్వహించారు.

### నాగేంద్ర కుటుంబానికి పరామర్శ

దెందులూరు: సోమవరప్పాడు వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు చల్లపల్లి నాగేంద్ర ఆకస్మిక మరణం తనను బాధించిందని పార్టీ పరంగా, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్ ఫెడ్‌మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. బుధవారం సోమవరప్పాడులో చల్లపల్లి నాగేంద్ర కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, కొఠారు రామచంద్రరావు పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాగేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి పార్టీపరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# టెన్త్ సప్లిమెంటరీకి ప్రత్యేక తరగతులు

- అందరూ ఉత్తీర్ణులయ్యేలా చర్యలు
- అధికారుల నిరంతర పర్యవేక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాలు ఏలూరు అర్బన్, మండల విద్యాశాఖాధికారులను, ఆ పరిధిలోని ఉపాధ్యాయులను తీవ్ర అసంతృప్తికి గురిచేశాయి. రాష్ట్ర స్థాయిలో ఫలితాల్లో ఏలూరు జిల్లా 64.35 శాతం ఉత్తీర్ణత సాధించగా జిల్లా కేంద్రం ఏలూరు అర్బన్, రూరల్‌లో కనీసం ఆ స్థాయిని కూడా చేరుకోలేకపోవడం విమర్శలకు గురయింది. పైగా జిల్లా విద్యాశాఖాధికారి ప్రత్యేకంగా ఈ జిల్లాలో విజయకేతనం పేరిట ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినా ఫలితాల సాధనలో విఫలమవడంతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఏలూరు రూరల్ పరిధిలో కాస్త మెరుగ్గా 56.30 శాతం ఉత్తీర్ణత సాధించగా, అర్బన్ పరిధిలో 53.2 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించడం వారికి మింగుడు పడలేదు. దీంతో జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి సప్లిమెంటరీ పరీక్షల్లోనైనా విద్యార్థులంతా ఉత్తీర్ణులను చేసే బాధ్యత తీసుకోవాలని కాస్త కటువుగానే మందలించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు కార్యోన్ముఖులయ్యారు.



శనివారపుపేట హైస్కూల్లో విద్యార్థులకు బోధిస్తున్న సబ్జెక్టు టీచర్



ఏలూరు ప్రభుత్వ బాలికల హైస్కూల్లో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న బాలికలు

**ఉత్తీర్ణత వివరాలు ఇలా..**

ఈ నెల 6వ తేదీన విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఏలూరు అర్బన్ పరిధిలోని 15 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నుంచి 1,347 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 717 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. మరో 630 మంది అనుత్తీర్ణులయ్యారు. ఏలూరు రూరల్ పరిధిలోని ఎనిమిది ఉన్నత పాఠశాలల నుంచి 540 మంది పరీక్షలు రాయగా 304 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 236 మంది అనుత్తీర్ణులయ్యారు.

**ప్రత్యేక తరగతులు**

జిల్లా స్థాయి ఉత్తీర్ణతా శాతాన్ని కూడా సాధించలేకపోవడాన్ని తీవ్రంగా పరిగణించిన విద్యాశాఖ అధికారులు ఈ సారి సప్లిమెంటరీ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని సబ్జెక్టు టీచర్లు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలిచ్చారు. దీంతో అనుత్తీర్ణులైన విద్యార్థులకు నిత్యం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యే వరకు ఆయా సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులను కొనసాగించేందుకు ఏర్పాటు చేసుకున్నారు. ఈ తరగతులను విద్యాశాఖాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**జూన్ 2 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు**

పదో తరగతి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులు సైతం విద్యా సంవత్సరం వృథా కాకుండా ఇంటర్మీడియట్‌లో చేరేందుకు వీలుగా ప్రభుత్వం సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చే జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జూన్ 2న ఫస్ట్ లాంగ్వేజ్, 3న సెకండ్ లాంగ్వేజ్, 5న ఇంగ్లీష్, 6న గణితం, 7న సైన్స్, 8న సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహించనున్నారు.

### సినీ గేయ రచయిత ప్రసాద్‌కు నివాళి

ఏలూరు (టూటౌన్): సాహిత్య సినీ గేయాల రచయిత కలేకూరి ప్రసాద్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక నరసింహారావుపేటలోని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలేకూరి ప్రసాద్‌కు నివాళులర్పించారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ గొప్ప సాహితీవేత్త కలేకూరి ప్రసాద్ అని కొనియాడారు. దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు, ఎస్.రాజేష్, పి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు.

### కలెక్టర్‌ను కలిసిన ఏలూరు డీఎస్పీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ

ఏలూరు(మెట్రో): ఏలూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఇ.శ్రీనివాసులు బుధవారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డీఎస్పీ శ్రీనివాసులును జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అభినందించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ 1991 బ్యాచ్‌కు చెందిన తాను ఆయా జిల్లాల్లో పనిచేశాని చెప్పారు. పులివెందుల నుంచి ఏలూరుకు వచ్చానన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన సందీప్



కలెక్టర్ వెంకటేష్‌కు మొక్కను అందిస్తున్న సందీప్

ఏలూరు (మెట్రో) / ఏలూరు టౌన్ : జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను బుధవారం ఆంధ్రప్రదేశ్ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సొంగా సందీప్ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌వెంకటేష్‌ను కలిసి మొక్క అందజేశారు. లెడ్‌క్యాప్ డైరెక్టర్ నియమితులైన సందీప్‌ను కలెక్టర్ అభినందించారు. సందీప్ కలెక్టర్‌తో మాట్లాడుతూ జిల్లాలో లెదర్ ఇండస్ట్రీస్ స్థాపనకు సహకరించాలని కోరారు.

# అర్హులందరికీ పథకాలు అందాలి

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏదైనా సాంకేతిక కారణాలతో పథకాలకు ఎవరైనా దూరమైతే వాటిని పరిష్కరించి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశించారు. ఏలూరు నగరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 100 రోజులు విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఏలూరు 36వ డివిజన్‌లో నూరు రోజుల సంబరాలు అంబరాన్ని అంటాయి. వందలాది మంది యువత, మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం చింతచెట్టు వీధి నుంచి ఎమ్మెల్యే నాని పాదయాత్రగా ఇంటింటికీ వెళుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే నానికి కార్పొరేటర్ భీమవరపు హేమ సుందరి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు భీమవరపు సురేష్ ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్‌కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ గంపల బ్రహ్మవతి, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, అర్జి సత్యవతి, జనపరెడ్డి కనకశ్రీ రాజేశ్వరి, దేవరకొండ శ్రీనివాస్, కలవకొల్లు సాంబ, గరికిముక్కు జయకర్, బత్తిన విజయకుమార్, కత్తిరి రామ్మోహనరావు, ఏఎంసీ డైరెక్టర్ మేతర సురేష్, వాణిజ్య విభాగం నాయకులు మోటమర్రి సదానందం, లీగల్‌సెల్ రామాంజనేయులు, నాయకులు పొలడుగు మురళీశ్యామ్, కోరాడ బాబు, మజ్జి కాంతారావు, సొసుపల్లి యుగంధర్, పొలిమేర హరికృష్ణ, గాడి మధు, ఆర్జి నాగేశ్వరరావు, తోట శివ, మైనార్టీ నాయకులు ఎస్‌కే రియాజ్ ఆలీఖాన్, నిడికొండ నరేంద్ర, యల్లాపు మోజెస్, రిజ్వాన్, చైతన్య, లూటుకుర్తి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు 36వ డివిజన్‌లో తన కొడుకు అనారోగ్యం గురించి ఎమ్మెల్యే నానికి వివరిస్తున్న మహిళ



ఏలూరు 36వ డివిజన్‌లో పథకాల ద్వారా పొందిన లబ్ధికి సంబంధించిన బ్రోచర్‌ను మహిళకు అందిస్తున్న ఎమ్మెల్యే నాని

## 'జగనన్నకు చెబుదాం' కాల్‌పై దర్యాప్తు

కొయ్యలగూడెం: జగనన్నకు చెబుదాం కాల్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం బయ్యన్నగూడెంలో విచారణ చేపట్టారు. బయ్యన్నగూడెంలోని జగనన్న కాలనీ నిర్మాణ ప్రాంతంలో ప్రభుత్వ మద్యం దుకాణం నిర్వహిస్తున్నారని, మందుబాబులు వీరంగంతోపాటు ఇళ్ల స్థలాల్లో అసాంఘిక కార్యకలాపాలు పాల్పడుతున్నారని స్థానికులు స్పందనలో ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో తిరిగి జగనన్నకు చెబుదాంకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎక్సైజ్ శాఖ ఎస్సై అబ్దుల్ ఖలీల్, ఏఎం ఆర్.దుర్గాప్రసాద్ విచారణ నిర్వహించారు. గత ఫిర్యాదుకు తమ వాంగ్మూలం తీసుకోకుండానే సిబ్బంది క్లోజ్ చేసినట్టు ప్రజలు అధికారుల వద్ద ఆరోపించారు. మద్యం దుకాణాన్ని ప్రజలకు నష్టం కలగని ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దీనిపై వీఆర్వో తెల్లం గంగారత్నం సమక్షంలో ప్రజల వద్ద నుంచి అధికారులు ఫిర్యాదు స్వీకరించారు. గ్రామస్తులకు మద్దతుగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత మద్దతుగా నిలిచారు. మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని, ఫిర్యాదును పక్కదోవ పట్టించిన ఎక్సైజ్ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉప సర్పంచ్ కోరుకొండ లలిత, డ్వాక్రా గ్రూపు లీడర్లు, వార్డు మెంబర్లు నక్కా లక్ష్మి ప్రసన్న, తోట విజయలక్ష్మి, దాసరి సుబ్బాయమ్మ, తొంట కృష్ణ పాల్గొన్నారు.

# ఏడు ప్రాంతాల్లో వాటర్ ఫౌంటేన్ల ఏర్పాటు

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో) / ఏలూరు టౌన్ : ఏలూరు నగరాన్ని సుందరీకరణ చేయడమే కాకుండా వాయు కాలుష్యం తగ్గించేందుకు దోహదపడేలా సుమారు రూ.2 కోట్లతో ఏడు ప్రాంతాల్లో వాటర్ ఫౌంటేన్లు ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ నుంచి పాతబస్టాండు, తంగెళ్లమూడి వంతెన, కండ్రికగూడెం సెంటర్, ఆశోక్ నగర్ వంతెన ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అధికారులతో కలిసి కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నగర వాసులకు స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణాన్ని అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అశోక్ నగర్ వంతెన డౌను, తంగెళ్లమూడి వంతెన వద్ద, జూట్ మిల్లు సెంటర్లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) నిధులతో, పాత బస్టాండు సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్‌లో నగరపాలక సంస్థ నిధులతో, కండ్రికగూడెం, సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ సెంటర్ వద్ద ఈడా నిధులతో వాటర్ ఫౌంటేన్లను ఏర్పాటుచేయాలన్నారు. ఒక్కో వాటర్ పౌంటేన్ రూ.30 లక్షల అంచనాతో చేపట్టనున్నట్టు తెలిపారు. పాత బస్టాండు, జూట్ మిల్ సెంటర్, కండ్రికగూడెం, తంగెళ్లమూడి, శాంతినగర్, ప్రాంతాల్లో వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ ప్రాంతాల్లో వాటర్ ఫౌంటేన్లు ఏర్పాటు ద్వారా కొంతమేర వాయుకాలుష్యాన్ని నియంత్రించవచ్చని చెప్పారు. జెడ్పీ కార్యాలయం సమీపంలో వాటర్ ఫౌంటేన్ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర మున్సిపల్ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, డీఈ సత్యనారాయణ, ఏఈ రాఘవేణి ఉన్నారు.



ఏలూరులో వాటర్ ఫౌంటేషన్ల ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 22 | అరటి కాయ (1) | 05-07 |
| వంకాయలు (గులాబీ) | 24 | చిక్కుడు కాయలు | 80 |
| వంకాయలు (కాంతులు) | 32 | చామదుంపలు | 50 |
| వంకాయలు (తెలుపు) | 36 | ములక్కాడలు | 05-07 |
| బెండకాయలు | 24 | కంద | 72 |
| పచ్చిమిర్చి | 48-56 | బీట్‌రూట్ | 38 |
| కాకర కాయలు | 40-44 | కీరా దోస | 40 |
| బీరకాయలు | 30 | ఫ్రెంచ్‌బీన్స్ | -- |
| బీరకాయలు (పందిరి) | 40 | అల్లం | 232 |
| క్యాబేజీ | 18 | కొత్తిమీర (కట్ట) | 20 |
| క్యారెట్ | 30 | పాలకూర | 08-12 |
| దొండకాయలు | 20 | చుక్కకూర | 08-12 |
| బంగాళదుంపలు | 22 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 20 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 40 | పుదీనా | 07 |
| దోసకాయలు | 14 | బఠాణి | -- |
| ఆనబకాయ (1) | 10-15 | క్యాప్సికమ్ | 68 |
| పొట్లకాయ(1) | 15 | చిలకడదుంప | 32 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

### ఏసీ బస్సులు..

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర) | 21.00 | 22 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర) | 21.00 | 21 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 33 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 14 |

### సూపర్ లగ్జరీ

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 16 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 23 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 10 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4804 | 17 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 16 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 22.15 | 34820 | 22 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 09.00 | 4794 | 34 |
| ఏలూరు - విశాఖపట్నం | 12.00 | 4840 | 34 |
| ఏలూరు -విశాఖపట్నం | 22.00 | 4838 | 34 |
| ఏలూరు -తిరుపతి | 16.00 | 4830 | 31 |

# హమాలీలకు దుస్తుల పంపిణీ

ఏలూరు రూరల్: ఏలూరు మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. బుధవారం యార్డ్‌లో పనిచేస్తోన్న 500 మంది హామాలీలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాని మాట్లాడుతూ నిమ్మకాయల ఎగుమతుల్లోనే దేశంలో పేరు గడించిన యార్డ్‌ను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. దీనిలో భాగంగా సుమారు రూ.4 కోట్లతో జంబోషెడ్డుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు మాట్లాడుతూ నాని సూచనల మేరకు పాలకవర్గం రైతులు, హమాలీల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. తొలుత సర్ ఆర్థర్ కాటన్‌దొర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం, హమాలీ సంఘం నాయకులు ఆళ్లనానికి పూలమాల వేసి, మెమోంటో ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో యార్డ్ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, నగర మేయర్ షేక్ నూర్జాహాన్‌భేగం, డిప్యూటి మేయర్ గుడిదేశి శ్రీనివాస్, రాష్ట్ర సంస్కృతిక మండలి చైర్మన్ పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఇడా చైర్మన్ ఎంఆర్‌డీ ఈశ్వరితో పాటు బలరాం, పెదబాబు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



హమాలీకి దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే నాని

### శ్రీదేవి శత చండీయాగం ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం త్రిశక్త్యాత్మిక శ్రీదేవి శత చండీ యాగ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గోపూజ, గణపతి పూజ, వేదపారాయణలు, సుందరకాండ పారాయణలు, మహాలింగార్చన, శ్రీచక్రార్చన, సూర్యనమస్కారాలు, యాగశాల ప్రవేశం చేశారు చండీ సప్తశతీ పారాయణ, చండీ హోమం నిర్వహించారు. పంచగవ్య ప్రాశన, దీక్షావస్త్ర కంకణ ధారణ, అగ్ని మథనం, వాస్తుపూజ, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతో భద్ర మండల దేవతా ఆవాహన, షోడశ స్తంభ పూజ, వేద పారాయణ చేశారు. సాయంత్రం ప్రదోషకాల పూజ, యాగశాల బలి, గ్రామ దేవతలు అమ్మవార్ల ఊరేగింపు, గంగా కాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చతుర్వేద స్వస్తి, శ్రీ విద్యారణ్య ప్రోక్త కమల సంపుటిత శ్రీ మహాలక్ష్మీ హోమం నిర్వహించారు. పూజల్లో నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

### వృద్ధులు, బాలలకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందించిన నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): బాలవికాస్ భారతి ఆధ్వర్యంలో వృద్ధులు, బాలలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. మానవత విద్యా నిధి చైర్మన్ బాలవికాస్ భారతి గౌరవ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు తల్లి కమలావతి ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక పవరు పేటలోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఫాదర్ బాల పాల్గొన్నారు. జన్మనిచ్చిన అమ్మ త్యాగాన్ని, అమ్మ ప్రేమను ఏ ఒక్కరూ మరువకూడదన్నారు. ఈ సందర్భంగా వృద్ధులు, బాలలకు 15 రోజులుకు సరిపడా పౌష్టికాహారం అందజేశారు. బాలవికాస్ భారతి అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను జీవితాంతం చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల కోరికల మేరకు సమాజానికి సేవ చేయాలన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, ఏలూరు మానవత సంస్థ కార్యదర్శి మేతర అజయ్ బాబు, విజ్ఞాన కేంద్రం సభ్యులు విజియం కృష్ణారావు, పి.రత్నాకర్ రావు, కరుణోదయ మానసికి వికలాలంగుల సంస్థ చైర్మన్ డొమ్నిక్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

దెందులూరు: మండలంలోని అలుగులగూడెం గ్రామంలో విద్యుత్‌ఘాతానికి బుధవారం గేదె మృతి చెందింది. బాధిత రైతు చెరుకు ప్రసాద్ మాట్లాడుతూ తమ గేదె నెరుసు అనితకు సంబంధించిన పొలంలో బుధవారం మధ్యాహ్నం ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిందన్నారు. ఘటనా స్థలాన్ని దెందులూరు విద్యుత్ లైన్‌మెన్ పరిశీలించారు.

### స్పందన ఫిర్యాదుపై విచారణ

దెందులూరు: స్పందన ఫిర్యాదుపై బుధవారం ఏలూరు ఆర్‌డీఓ పెంచల కిషోర్ విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన కట్టా జయమణి, ఇతరుల మధ్య ఉన్న మూడు సెంట్ల ఇళ్ల స్థల సమస్యపై ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వివాదాస్పద స్థలాన్ని పరిశీలించి ఉభయుల వాదనలను విన్నారు. ఈ నెల 25న దెందులూరు తహసీల్దార్ కార్యాలయానికి రావాలని నోటీసులు జారీ చేశారు. తహసీల్దార్, వీఆర్‌ఓ పాల్గొన్నారు.